పిప్పదంట్లు

"ఒంటిపూట కూడు తింటావున్నా సీతాం నేను యింతమటుకు ఎటనోగట్ట పోతావుండంగందా, తనకు యిరోశనాలు బట్టుకుని రోజురోజుకు మనిషి ఆవజాన దిగజారిపోతావుండది, నే నేంజేసి చచ్చేటట్టు? కూలిదొరక్కా, కూలి దొరికితే గింజదొరక్కా యీవజాన అడకత్తెర్నోబడి కొట్టుకుంటుండ నాబోటోడికి బగమంతుడు మటుకేం జేత్తాడు?

"తిండికి కరువొచ్చిందని రేసను పెట్టారు. నిజమే – పెట్టాల్సిందే నన్నడిగితే – మరి పెట్టినాక ఆ కూసిన్నోనయినా – నాయం జరగాల్చిందేగా? సేతిలో దమ్మిడంటే దమ్మిళ్ళేక కిందటివారం రేసను తియ్యకపోతే యీ వారం అయి ఆవజాన నీలుగారిపోల్చిందేనా? నాయుం సూడమన్నా. పోనీ రూల్చుండయ్యంటే రూల్చుండయ్యనుకుందాం. రేసను ఎంకయ్య ఏమన్నాడూ? "మీ కేంరా నలుగురి చేలో కూలిచేస్తేసరి, గాదెనిండా పోసుకుని ఏడాదిపొడుగూతా కాలు మీద కాలేసుకుని తినొచ్చూ! మీకు కరువొచ్చిందంటే రాజాధి రాజులకు గూడా వొచ్చిందన్నమాటే!" అన్నాడు. ఆ మాట నన్నేనా అనాల్చిందీ? వూళ్లోవుండ నలుగురు పెద్దమనుషుల్ని పిలుసుకొచ్చి యిల్లంతా తనికీచేయించి గందా ఆ మాటనాల్చిందీ? ఆ పెద్దమనుషులికి మటుకు తెలవదూ మనూర్లో ఎవరింటో ఎంతెంత వుండదీ? నా పెళ్ళానికి తిండి తక్కువయి ఏడిజేసి యిరోశనాలు పట్టుకుంది సానామందికి తెల్చే? రంగయ్య రూపాయికి తవ్వెణ్ణర్సోలెడు బియ్యంకాడికి పబిలీగ్గా గల్లా కొడ్తుండాడే, యీ ఎంకయ్య ఆళ్ళసంగతి ఎత్తడేం? ఎంకయ్యా? అబ్బో యీన మంత్రిపని జెయ్యాల్చినోడుగాదూ? ఆ మద్దె యిట్టాగే ఓ సోమారంనాడు సేతిలో డబ్బుసాలక అద్దరూపాయి బియ్యమే కొలిపించుకెళ్ళి, యిట్ట మూడోరోజు నొద్దునూ, యిగనేం వుంటయ్యాడా? ఓరి నీ యిల్లు బంగారం గాను యిదేందయ్యా అనడుగుతే "యిదొకటా పైగా! అప్పుడే తీసుకెళ్తివిగా అన్నీ? కావాలంటే ఎవరికన్నా కార్డు చూపించుకో వాళ్ళే చెపుతారు గీత ఎక్కడి దాకా వుందో! చస్తున్నాం యీ చదువురాని ముఠాతో!" అన్నాడే ఎంకయ్యా! ఆ గీతేందో, అదెక్కడ కొచ్చి నిలుసుద్దో నా కెట్ట తెలుసుద్దీ! మనిషి మాట నావజాన ఎత్తాతలపారేస్తే అటిటు సూడకుండా నెత్తిన గుడ్డేసుకుని యింటికిపోలా నేనూ? అసలు యీ రేసనాయన్తో పేసీపడేగతేం బట్టిందంటా. బసవయ్యగారు నాయంగల మనిషయితే, కూలీకి ముంగల దాన్యం కొలుత్తానని వొప్పందంజేసుకునీ, తీరా నాట్లయినాక

మా ముగ్గుర్నీకలిపి దగ్గిర దగ్గిర రెండు బత్తాల దాన్యం గింజలు ఎగ్గొట్టి, డబ్బు సేతిలో పెట్టేను అన్నాడు గందా! రేసను కొట్టో బియ్యం సాలకా, రంగయ్య కాడికెల్తే ఆ వుండది నీలుగారిపోయీ - సివరికి ఏం దక్కినట్టయిందీ? ఆ దాన్యం గింజలే వుంటే ఆడది ఆవజనా మంచానపడేదా, ఇన్ని పేసీలుండేయా?" అనుకుంటా రేషనుషాపు దగ్గిరకొచ్చి తలెత్తి చూశాడు పాపయ్య.

"అబ్బో ఏందీ జనం! కార్డుండ పెతోరూ యివాళె వొచ్చారేందబ్బా! ఎందో అరుసుకుంటున్నారే - తెలవదేం - ఏందబ్బా....." జనాన్ని తోసుకుంటూ షాపుముందర కెళ్ళి నుంచున్నాడు పాపయ్య.

షాపు తాళంవేసి, తాళం చేత్తో వెంకయ్య అక్కడ నుంచుని వున్నాడు.

"యిప్పటికి పదకొండుసార్లు చెప్పాను, మళ్ళీ పన్నెండోసారి చెపుతున్నా, బియ్యం రాలేదు" అన్నాడు వెంకయ్య.

"ఎప్పుడొత్తయ్" అన్నారు జనం.

"ఎప్పుడొచ్చేదీ నేనేం కలగన్నానా?" అన్నాడు వెంకయ్య.

"మరి మేం మేంగావాలి?" అన్నారు జనం.

చేతులెత్తి జనానికీ దండం పెట్టాడు వెంకయ్య.

గుటకమింగుతున్న పాపయ్యను జనం అటిటు తోశారు.

* * *

పన్నెండు గంటల రాత్రయిందేమో ననుకున్నాడు పాపయ్య. "యిగ తనకు నిద్రపట్టదు. పట్టటం సాలా అనుమానం. పడ్తే బాగుండు... కడుపులో ఏం లేంది నిదరపట్టేదీ లేందీ తనకు బాగా గేపకంరావటంలా. మరి తన పెళ్ళామూ, కూతురూ నిదరపోతుండారే సిత్రంగావుంది? యివ్వాల్టికి నాలుగు రోజులు కాలా రేసనుసాపు మూసీ? అయింది... అటుమొన్నేమో, ఆ వుండ కాసిని అటుకులు తిన్నాం. మొన్నా, నిన్న పెసర గుగ్గిళ్ళూ - రూపాయికి తవ్వెణ్ణర్సోలెడు పెసలా!... అటు మొన్న శేషయ్యగారి కూలి రూపాయిపావలాబెట్టి తవ్వెడు సోలెణ్ణరగిద్దెడు పెసలుదెచ్చి, మొన్న సోలెడూ, నిన్న సోలెడూ పోతే యింకా ఎన్ని వుండయి? సోలెణ్ణరగిద్ద దుండయి. అయి రెణ్ణాళ్ళు వుంటం ఎందుకయినా మంచిదిలే. ఇవాళ గల్జేరాకు పులుసుతాగితే కడుపంతా తొలిసినట్టయింది, ఎందుకనబ్బా? కాత్తె గట్టిగా ఏమన్నా పడకపోతే అట్టయిందా? ఏమయితే మటుకు రూపాయికి తవ్వెణ్ణర్సోలెడు పెసల్లెక్కన ఎన్నాళ్ళు దింటాం? ఇన్నాళ్ళూ రంగయ్య రూపాయికి తవ్వెణ్ణర బియ్యమన్నా యిచ్చేవోడు. ఇప్పుడు మనిషి ఎందుకనో మాట్టాట్టంలేదే? దాన్యం

అయిపొయినయ్యో ఏమో? లేకుంటే వున్నట్టుండి ఏ తవ్వెడో, మూడర్సోళ్ళకాడికో బరాటు తీస్తాడెట్టా? ఆయనకేం మారాజు, అనుబవం వుండది. గనుక ఏంజేసినా జేత్తాడు. కాదుగూడదంటే, తింటానన్నా కూకుంటాడు గాని మాకుమల్లే యీవజాన కడుపులు కాల్చుకోడుగా! అసలు సుడిగల మనుషులే వేరు.

"ఆవజాన అయిపోతుండది తన పెళ్ళాం, బొమికలు మిగిల్నయి. జావ పొయమంటాడు బెమ్మానందం. రెండుపూటలా వరన్నం తింటున్నంతకాలం గెడకర్రలాగా వుండే మనిషికి జావపోస్తే నయంగుంటదా? యిది కూడుచాలక వొచ్చిన జబ్బయితే? అసలు ఏ మాత్రం ఒంటో సుమారుగావున్నా వొచ్చి మీద వాలేదిగాదూ! ఎనక ఓ పూట తిన్నా, తినకపోయినా యింతన్యాయం ఎప్పుడన్నా వుందా? ఎంత ముదనష్టబ్బతుకయింది మాదీ!... రేసనుకొట్టోకి బియ్యం ఎప్పుడొస్తయ్యో?... ఎందుకో అనిపిచ్చుద్ది తన పెళ్ళాం దక్కదేమోనని– చా, ఎదవను గాకపోతే యిట్టనుకుంటానంట! రేపు నాకు యిరోశనాలు పట్టుకుంటేనో? అసలు వరస జూస్తే రోజులు అట్టాగే వుండయిలే! పోనీ సత్తే అందరం జస్తాం – యింతకన్న సచ్చేదేంది! తెల్లారి లెగుస్తే కూడో కూడో అంటా దేవులాటయిపోయింది. ఎహె ముదనష్టబ్బతుకయినాక యిగ దేనికీ!

"గల్జేరాకు పులుసు పాయసంగా తాగాలనొచ్చిందే? పెసర గుగ్గిళ్ళు సానానయం! సీతాంగూడా అట్టనే అంది. పిచ్చిముండ అదే కాస్త నయం. ఇట్టాటి సిక్కులు ఎన్నొచ్చినా – మొదలు పిల్ల నోరెత్తుతేగందా అనుకోవల్చింది. పోనీలే గుడ్డిలో మెల్ల... యింకా సోలెణ్ణర గిద్దెదుండయి! ఎటనయినా పెసర గుగ్గిళ్ళు బాగానే వుంటాయి. చనగలుగాని, కందులుగాని – యింకేవీ వుండవు యీటంత రుసిగా! రూపాయికి తవ్వెణ్ణర్సోలెడు... సానా... కష్టం..."

ఏంటో చప్పుడయిందనుకున్నాడు పాపయ్య. చీకట్లో ఏం కనుపించటం లేదు. ఎలికయివుంటుంది. 'అదేం పీక్కు తిందామనొచ్చిందో' అనుకున్నాడు పాపయ్య.

"యివాళ తనకు నిద్రరాదు. ఎవరన్నా నాలుగు వొడ్ల బస్తాలు తన యీపు మీన పడేస్తే బాగుండు – ఏంటో."

ఏంటో బర్రెగొడ్డు జనపకట్టె తింటున్నట్టు పరుక్కు... పరుక్కు మంటున్నది. సీతాం నిద్దర్లో కలవరిస్తున్న దనుకున్నాడు పాపయ్య. పిచ్చిముండ నిద్దర్లో ఏంటో నములుతుండది... పరుక్... పరుక్... పర్రుక్ – పాపయ్య గబాల్న లేచి సీతాం పక్క తవిడాడు. పక్క ఖాళీగా వుంది – ఒక్క వూపులో గుడిశ బయటకొచ్చి పడ్డాడు పాపయ్య.

ఆ నక్షత్రాల కాంతిలో సీతాం మట్టి అరుగుమీద కూచుని – ఆ చప్పుడు చెయ్యడం స్పష్టంగా చూశాడు పాపయ్య.

"ఏందే నువు జేసేదీ?" అన్నాడు పాపయ్య.

"వూరకనే –" అన్నది సీతాం గొంతులో గుడ్డ దూరినట్టయి.

'మాట సరీగా రానీ?" అన్నాడు గలబరించినట్టు.

"పెవ్–" అంది సీతాం.

పెటీమంది సీతాం వీపుమీద – మెరుపు మెరిసి ఢాం మ్మన్నట్టు. నేల కరుచుకున్న సీతామును గూడుపట్టుకు యీడ్చుకుంటూ గుడిశెలో కొచ్చి దీపబ్బుడ్డి ముట్టించాడు పాపయ్య.

"అయ్యో – ఏందిదంతా–" అన్నది మంచంలోవున్న పాపయ్య పెళ్ళాం సుబ్బమ్మ, ఆత్రంతో వొణుకుతూ.

"మాట్టడవేందే?" పాపయ్య కాలులేచింది.

"అయ్యో కొట్టమాకయ్యా సచ్చానూ–" అనరచింది సీతాం బాధతో ముడుచుకుపడిపోతూ.

బుసలిడిస్తున్న పాపయ్య కాలు అట్లాగే ఆగిపోయింది, గోడదగ్గిర కదలకుండా చుట్టగా పడివున్న సీతాన్ని చూసి.

"బాబో–" అన్నది సుబ్బమ్మ జుట్టు పీక్కుంటూ.

బిత్తరపోయి నుంచున్నాడు పాపయ్య. గుడిశ కూలి నెత్తిన పడ్డట్టు.

"ఓ దేవుడా–" అన్నది సుబ్బమ్మ హీనస్వరం.

ఆ నిమిషాన ఎవరన్నా తన నెత్తిన పలుగు దిగేస్తే బాగుండు ననుకున్నాడు పాపయ్య.

మెల్లిగా – వొళ్ళోనుంచి కింద పడిపోయిన పెసల్ని పోగుచెయ్యటం మొదలుపెట్టింది సీతాం.

ఒక్కసారి వొళ్ళు వొణికినట్టయింది. పక్కదగ్గిర స్తంభానికి జారగిల పడ్తున్న పాపయ్యకు.

"నిలువున పోవాల్సింది పిల్లపానం!" అన్నది సుబ్బమ్మ శ్వాస తిప్పుకుంటూ.

"నాకేంబట్టలా అంతకర్మ?" అన్నాడు పాపయ్య గుమ్మంలోంచి చీకటిలోకి చూస్తూ.

"నిసిరేత్రి నీకేంబుట్టిందే నీ పిల్ల సావా! దొంగగెడ్డి తింటే పానం నిలుసుద్దంటే, నాయంగా తింటే తినాలగానీ?" అన్నది సుబ్బమ్మ.

"అసలాడ వుండదే సోలెణ్ణర గిద్దెడు! తిక్కరేగిందంటే రేగదూ?" అన్నాడు పాపయ్య.

ఎత్తిన పెసల్ని మిగతావాటితో మూకుట్లోపోసి, కిక్కురుమనకుండా పడుకుంది సీతాం.

"రేపో ఎల్లుండో ఆ సోలెణ్ణర గిద్దెడూ అయిపోయినాక ఏమవుద్దీ? దినమే గండంగా వుంటే ఒకప్పుడుమటుకు సావుతప్పుద్దా!" అన్నది సుబ్బమ్మ.

"అయితే యివాళే సావమనా నువనేది?"

"సచ్చినోళ్ళెవురూ చెప్పి సావలా!"

"అసలు మనం ఎందుకు సావాలంటా?"

"నే బతుకుతానని నీకేమన్నా ఆసుండదా?"

"అట్టనమాకే నీకు పున్నెముంటదీ! అసలు యిరోశనాల్తో పేగు దిగజారి ఆకలి తెలవక నీ కట్టుండదిగాని కడుపు మంటతో పానం ఎట్టుడికి పోతుండదీ నీకేం తెల్చుద్దిలేవే! యిట్ట చావటం ఎవరిపానం వొప్పుద్దిలేవే!"

"అందుకేనంటయ్యా సిన్నముండను అంతలావు తన్నుదంతివీ?"

"తనొక్కతేనా యీదుందీ?"

"ఎంతకాడికి దిగజారిపొయ్యావ్! యింతకు ముంగల నీ నోటెంట యిట్టాటి మాటలురాలా!"

"నేనా? అదిగందుకే అంది పేగు దిగజారింది నీకని."

"నాకూ దిగజారింది వూళ్ళోవుండ నాబోటి ఆడగూతుర్లకూ దిగజారింది. మొగాళ్ళు ముండమోసికూకుంటే!"

"ఏందో కొత్తపదాలు రానిత్తుండావే?"

"అంతగాక మరేంది? ఒకపక్క బియ్యం లేవు. రేసను మూసేశామంటుండిరీ. యిటుపక్క రంగయ్య గంగయ్యలు రూపాయికి తవ్వెడు బియ్యం పబిల్లీగ్గా అమ్ముకుంటుండిరి! ఎవురా మొగోడు వూళ్ళోవుండ పెద్దమనుషుల్ని నిలేసి అడిగిందీ? నువేందో సావకుండా కూకుంటానంటుంటివే - సచ్చినాళ్ళంతా యిట్టా అంటానే సచ్చారు!"

"అయితే ఏందే నువనేదీ?"

"అనేదేంవుందీ బతకాలనుకునేవాళ్ళు యింటో గుప్పిడు గింజల్లేకబోతే సూర్లు సూస్తా కూకోరు!"

"ఎవరూ కూకుందీ?"

'ఎవురు కూకున్నారో - నాకీ గతిపట్టింది - రేపు దానికీ నీకూ పట్టుద్ది!"

"అయితే నువనేది యాడన్నా కన్నం ఎయమనా?"

"అంత ధైర్నం వుంటే రంగయని బయటికే లాగేవాడివి!"

"కొట్టో ఏపిస్తాడు, నీకు తెలవదు గామాల ఆయన సంగతి!"

"ఎవురు రంగయ్యా?"

"రంగయ్య కాకపోతే రామయ్య. మొన్న ఎవురో అన్నారంటా రామయ్య గారింటో సానా దాన్యబ్బస్తాలుండయ్యనీ - ఆయన్ని కాస్తా పోలీసోళ్ళు పట్టుకుబొయ్యారు - మరి అదెందుకో!"

"మనకెందుకొచ్చింది అరవమాక!"

"మరిగనేంది?"

"ఆయన కూలీకి ఎక్కువగా పోతావుగందా అట్టానే బసవయ్యగారి కాళ్ళు పట్టుకుందూ ఏమంటాడో?"

"అది తప్ప యింకేమన్నా మాట్టాడమంటాడు."

"ఎటనయినా తిప్పలు పడయ్యా పానం పోతుండది."

"రోజులు బెడిసికొట్టినయి యిగనేందే చేసేదీ! అప్పుడే యిస్తివి నీ కడియాలు - నల్సుకుపోయినై - యిదిగో - యాడవమాకే నీకు పున్నెం వుంటదీ - అయ్యోబగమంతుడా-"

"యింకా దగ్గిర కూకో-"

"కూకుంటాలే - అది గందుకే-"

తెల్లవార్తే బాగుందుననుకున్నాడు పాపయ్య.